# రక్తంలో రంగులు

ప్రతాప్ స్కూటర్‌కి స్టాండువేసి, కర్టెను తొలగించుకొని లోపలికి ప్రవేశించాడు. కమల హాల్లో లేదు. తను ఇప్పుడు సినిమా ప్రోగ్రాం వేసాడు కాబట్టి చక్కగా ముస్తాబు అవుతూ ఉంటుంది అనుకొన్నాడు. మెల్లగా వెళ్లి కళ్ళుమూయాలి అనుకొన్నాడు. అన్ని రూములూ చూశాడు. ఎక్కడా కనిపించలేదు. చివరకు పెరడు దగ్గరకొచ్చాడు.

అక్కడ ఏదో పోగొట్టుకొన్నట్లు దిగులుగా కూర్చొని ఉన్న కమలను చూడగానే కోపం వచ్చింది.

"ఏం సినిమాకు పోదామని ఇంకా ఇలా కూర్చొని ఉన్నావ్" అన్నాడు గట్టిగా.

కమల మాట్లాడకుండా లేచి నిలబడింది. మౌనంగా నేల చూపులు చూడసాగింది.

ప్రతాప్‌కు జాలి కలిగింది. ఏదో కారణం లేకపోతే తప్ప కమల మౌనంగా ఉండదు.

కమల నడుం చుట్టూ చేతిని పోనిచ్చి గుండెలకు హత్తుకొంటూ "చెప్పు కమలా ఏం జరిగింది. ఎందుకిలా ఉన్నావు" అన్నాడు లాలనగా.

"పిల్లలిప్పుడే స్నానంచేసి ట్యూషను కెళ్ళారు"

"మరి మన సినిమా ప్రోగ్రాం, రేపు వెళ్దామా"

కమల మాట్లాడలేదు.

"చెప్పు కమలా"

"సారీ అండీ· కాఫీ ఇవ్వడమే మర్చిపోయాను. ఉండండి పది నిముషాల్లో చేసుకొస్తాను''

విడిపించుకోబోయింది·

కాని ప్రతాప్ వదలిపెట్టలేదు.

"కాఫీ సంగతి వదిలెయ్ కమలా. ఇప్పుడైనా సినిమాకు వెళ్దాం. ఇంకా అరగంట టైముందిగా"

"వద్దండీ"

"ఏం"

"నా మనసేం బావోలేదు"

ప్రతాప్ చేతులు వాటంతటవే విడిపోయాయి. కమల ఇంట్లో కెళ్ళింది కాఫీ తేవడానికి. హాల్లోకొచ్చి తలపట్టుకొని కూర్చొన్నాడు.

ప్రతాప్‌కి కమల ప్రవర్తన ఏమీ అర్థంకావడంలేదు. ఈ ఎనిమిదేళ్ళలోనూ, కమల ఎప్పుడూ తనమాట కాదనేది కాదు. తను ఏదంటే అదే. తన గాఢ పరిష్వంగనమే స్వర్గమనుకొనేది. తను ఆమె ఒడిలో తలపెట్టుకొని ఆమె చెప్పే ప్రేమ పాఠాలకు ఊకొడ్తూ మధ్య మధ్య అమాయకుడిలా అదేమిటి, ఇదేమిటి అని ప్రశ్నిస్తే మధురంగా నవ్వేది.

అలాంటిది ఈరోజు ముభావంగా ఉంటే ప్రతాప్‌కి ఏదోలా ఉంది. మనసు ఏదో కీడు శంకించింది. ఎన్నడూలేని ఆమె ప్రవర్తన ఈనాడు విడ్డూరంగా కనిపిస్తోంది.

''కాఫీ తీసుకోండి'' అంది కప్పు అతని కెదురుగా ఉంచి.

''కమలా అలా కూర్చో"

''నాకు అవతల చాలా పనుంది. వెళ్లాలి''

"వెల్దువులే. అసలింతకూ ఏం జరిగింది. అలా ముభావంగా ఉన్నావు''

"ఏమీలేదు"

''ఏమీలేదనకు. నిజం చెప్పు'' అన్నాడు ఆమె కళ్ళలోకి సూటిగా చూస్తూ.

ఆమె ఆ చూపుల్ని తప్పించుకోవడానికి తల వంచుకొని గోళ్ళు చూసుకొంటూ ఉండిపోయింది.

ప్రతాప్‌కి ఏమీ అర్థం కాలేదు. తను ఏమైనా పొరపాటుగా భార్యతో ప్రవర్తించాడా అంటే అలాంటిదేమీ జరగలేదు మరి ఈమె ముభావానికి కారణం? అందులో కమల మనస్తత్వం అందరి స్త్రీలకంటే విలక్షణమైనది. ఏదైనా బాధుంటే తనలోనే దాచుకొంటుంది. తనలో తనే కుమిలిపోతుంది. ఎవరితో ఏమీ అనదు. ఎవరేమన్నా భరిస్తుంది.

ఇంతలో ట్యూషను నుంచి పిల్లలొచ్చారు.

"మమ్మీ. మరే నాకు చాక్లెట్టివ్వు" అన్నాడు పెద్దవాడు.

చిన్నవాడు పరుగెత్తుకువచ్చి, "మమ్మీ ఎత్తుకో" అంటూ కాళ్లకు చుట్టుకొన్నాడు.

కమల నిర్వికారంగా వాళ్ళను ప్రక్కకునెట్టి లోపలికి వెళ్ళింది.

అదే ఇంకోసమయంలో అయితే వాళ్ళను దగ్గరకులాక్కొని ముద్దుపెట్టుకొని "నాబంగారు బాబులూ! ఎంత ముద్దుగా అడిగారురా" అంటూ ఎంతో గారాబం చేసేది.

వాళ్ళు ఊహించినట్లు జరక్కపోయేసరికి ఏడుస్తూ వెళ్ళి తండ్రి ఒడిలో తలదాచుకొన్నారు.

ప్రతాప్ హృదయం కలుక్కుమంది. తను మగవాడు. అర్థంచేసుకొనే వయసుంది. తను ధైర్యంగా ఉండగలడు. కాని చిన్నపిల్లలతో ఇలా ఉంటే బేజారెత్తిపోరూ. అందుకే పిల్లలిద్దర్నీ

సముదాయించి గేటు వద్దకు తీసుకుపోయి రోడ్డువెంటవెళ్ళే వాహ నాల్ని చూపిస్తూ వాళ్ళని ఆనందింపజేశాడు.

ఆరాత్రి పిల్లలిద్దర్నీ నిద్రపుచ్చి అలాగే కూర్చొని ఉంది కమల. గదిలో పడుకొనివున్న ప్రతాప్ కమల లైటార్పి తన ప్రక్కకు వస్తుందేమోనని చాలాసేపు చూశాడు. అమె రాలేదు. ఇలా కాదని బుజ్జగించి అమె మనసులోని మాట బయటకు లాగా లనుకొన్నాడు. పిల్లలు పడుకొనిఉన్న గది గుమ్మం వద్దకు వచ్చి నిలబడ్డాడు.

"కమలా"

"ఊఁ"

"ఎందుకా ఆలోచన పడుకొందువుగాని రా" అంటూ పిలి చాడు. ఆమె అతని వైపు చూస్తూ ఊరుకొంది. ప్రతాప్ లేచి అమె దగ్గరకువెళ్ళి చేయిపట్టుకొని కొత్తపెళ్ళికూతురిలా అమెను బెడ్ దగ్గరకు తీసుకొచ్చాడు.

కమల మౌనంగా పడుకొంది. ఆ రోజు ఎంత ప్రయత్నం చేసినా కమలను ప్రసన్నం చేసుకోలేకపోయాడు ప్రతాప్. అమె మనసులోని మాట చెప్పలేదు. మరునటి రోజు నుంచి పడకలు వేరయ్యాయి. కలిసిన మనసులు విడిపోయాయి.

ఇద్దరూ యాంత్రికంగా జీవిస్తున్నారు. భార్యా భర్తలుగా ఒకే గూడుకింద ఉన్నారే తప్ప సుఖంగామాత్రం లేరు. ఒకరితో ఒకరు మాట్లాడుకోరు. ముభావంగా ఉంటున్నారు. ఈ అనవసర తగాదాకు మనసొప్పని ప్రతాప్ పిల్లలు నిద్రపోయిన తర్వాత ఒకసారి భార్యను నిలదీశాడు

"ఏం కమలా నేనంటే అంత వెగటైపోయిందా"

"అదేం లేదు"

"మరయితే ఎందుకలా ముభావంగా ఉంటావు"

"బాగానే ఉన్నానే"

''ఎందుకు అబద్దాలాడుతావు. నువ్వు మనషివి చూడ్డాని కలా ఉన్నావేగాని నీ మనసులో ఏదో విషపురుగుచేరి నిన్ను తొలిచేస్తూ ఉంది. ఎందుకిలా నన్ను బాధపెడ్తావు''

"మిమ్మల్ని నేనేం బాధపెడుతున్నాను. మీరు అడిగింది కాదంటున్నానా"

"కమలా ఏమీ తెలియనట్లు బుకాయించకు. బలమైన ఇనుపకడ్డీలను సయితం కొలిమిలోపెట్టి మనిష్టంవచ్చినట్లు తిప్పు కోవచ్చు. కాని మనసనేదుంది చూశావూ. దానిని ఏసాధనంతోనూ బలవంతంగా ఎవరూ తనవైపు తిప్పుకోలేరు. అతి సున్నితమైన ఆ హృదయం ప్రేమ అనే కొలిమిలోనే కరుగుతుంది"

"అవును"

''అందుకే నీమనసు నావైపు తిప్పుకొనేంత ప్రేమ నా దగ్గర లేనందుకు విచారిస్తున్నాను"

".... .... .... ...."

"సిగ్గుపడుతున్నాను కూడా''

".... .... .... ...."

"జీవం లేని ఇది సంసారం కాదు నరకం. ఛీ....ఛీ" బయటకు వెళ్లి తలపట్టుకొని వాలుకుర్చీలో కూర్చొన్నాడు.

కొద్దిసేపటికి ఇంట్లోంచి వెక్కిళ్ళు వినపడ్డాయి. లోపలికి వెళ్ళేసరికి కమల గోడవైపు తల ఉంచి ఏడుస్తోంది. ఆమె పలుచని పొట్ట ఆ ఏడుపుకు కదులుతూ ఉంది. కారుతున్న కన్నీళ్ళని పైట చెంగుతో తుడుచుకొంటోంది.

ఆ పరిస్థితిలో ఆమెను చూసేసరికి అతనిలో బలీయమైన ప్రేమ దుఃఖంలా పెల్లుబుకింది, తను మౌనంగా ఉన్న కమలను

ఇన్ని మాటలని రెచ్చగొట్టి ఆమె మనసును బాధపెట్టాడు. తనకు ఆమె అంటే విపరీతమైన అభిమానం ఉండడంవల్ల తనతో ముభావంగా ఉంటున్నదనే కోపంతో ఇన్ని మాటలన్నాడు. నిజమైన ప్రేమికుడు తను ఎంత దుఃఖంలో ఉన్నా అవతలి వారి సుఖమే కదా కోరేది అనుకొన్నాడు.

అందుకే ప్రతాప్ ఆరోజు నుంచి కమలను ఏమనేవాడు కాదు. తన పెళ్లిచూపులు, పెళ్ళయిం తరువాత పండుగలకు పబ్బాలకుకూడా పోకుండా తనలోనే అన్నీ చూసుకొని తనలో లీనమైపోయిన కమల ముచ్చట్లు స్మృతికి తెచ్చుకొని దుఃఖాన్ని మఱచిపోయేవాడు.

కమల భర్త మీదలాగే పిల్లల విషయంలోకూడా ముభావంగా వాళ్ళ బాగోగులు చూస్తూ యాంత్రికంగా జీవితం గడిపేస్తోంది. రెండు నెలల తరువాత కమల తరపు దగ్గర బంధు వొకాయన వచ్చి కమలను, ఆమె భర్తను తన కుమార్తె వివాహానికి రమ్మని ఆహ్వానించిపోయాడు. భార్య తరఫువారు కావడంతో ప్రతాప్ అత్తగారు రెండురోజులు ముందుగా కుమార్తె ఇంటికి వచ్చారు.

అనుకొన్న సమయానికి ప్రతాప్‌కురావడం ఇష్టంలేక సెలవు దొరకలేదని దాటేశాడు. కమల పిల్లల్ని పెళ్ళికి తీసుకుపోవడం ఇష్టంలేదంది. ప్రతాప్ నిరుత్తరుడయ్యాడు అయినా మనసు సమాధాన పెట్టుకొన్నాడు. తల్లి ఎంత చెప్పినా వినకుండా పిల్లల్ని స్కూలుకు పంపి తనొక్కటే తల్లితో పెళ్ళికి బయలుదేరింది.

పిల్లల్ని కమల తనతో తీసుకుపోనందుకు ప్రతాప్ మనసు తీవ్రంగా బాధపడింది. పసిపిల్లల మనసులు విరిగి ఉంటాయి అనుకొన్నాడు. అఊళ్ళోనే వివాహంచేసుకొని కాపురంచేస్తున్న తన

చెల్లెల్ని వచ్చి రెండురోజులుండమని పిలిచాడు. తన భార్య కమల కసితోనే తనను, పిల్లల్ని నిర్లక్ష్యం చేస్తోందని భావించాడు.

పెళ్ళి వారింట్లో మొదట కమలకు, ఆమె తల్లికి వాకిట్లోనే ఎదురువచ్చింది పరిమళ.

"ఏం కమలా ఒక్కదానివే వచ్చావ్. మీఆయనా, పిల్లలేరి" అంటూ పలుకరించింది.

"ఏమోనే, నీవు మా ఇంటికి వచ్చిపోయినప్పటినుండి, మా ఆయనన్నా, పిల్లలన్నా, ఏదోగా ఉంది. వాళ్ళతో సరిగా మాట్లాడడానికికూడా బుద్ధిపుట్టడంలేదు" కమల జవాబు

పరిమళ వ్యంగ్యంగా ప్రశ్నించడం, కమల అమాయకపు జవాబు కమల తల్లికి ఏదో కొత్తవిషయం తెలియజేసింది. కమల ఆమె భర్త ప్రతాప్ తనముందు ఏమీ ప్రదర్శించకపోయినా వాళ్లిద్దరిమధ్య ఏదో అపార్థం ఉందనే విషయం ఆమె అంతకుముందే గ్రహించింది. ఇప్పుడు కారణం కొద్దికొద్దిగా బోధపడసాగింది.

ఇంతలో 'మమ్మీ' అంటూ ఒక పిల్లవాడు పరుగెత్తుకు వచ్చాడు. వాడు ఎర్రగా, సన్నగా ఉన్నాడు.

పరిమళ దగ్గరకొస్తున్న పిల్లవాణ్ని చేతుల్లోకెత్తుకుంది కమల.

"మీ పిల్లవాడు ఎంత బాగున్నాడే. నాకూ ఉన్నారు దేనికి, నల్లని మొద్దులు" ముద్దుల్లో ముంచుతూ అంది.

కాళ్ళుకడుక్కొని లోపలికి వచ్చారు. పెళ్ళికివచ్చిన బంధువులందరూ పరామర్శించారు. ప్రతిఒక్కరూ, భర్తను, పిల్లల్నీ తీసుకురాలేదేం అంటూ కమలను ప్రశ్నించారు. కమల భర్తకు సెలవు దొరకలేదని, పిల్లల్ని ఇంతదూరం ఎండలో ప్రయాణం చేయించడం ఇష్టంలేక తీసుకురాలేదని చెప్పింది.

ఎంతమందితో మాట్లాడుతున్నా పరిమళ, కమల సంభాషణ అతి జాగ్రత్తగా వింటూ పరిస్థితి గమనిస్తోంది కమల తల్లి. కమల, ఆమె భర్త అభిప్రాయ భేదాలకు కారణం విచారించసాగింది.

ఆ రాత్రి అందరూ భోజనాలుచేసి ఎవరికివారు తలా ఒక చోట మాట్లాడుకొంటున్నారు. పెళ్ళిమరురోజు ఉదయం ఆరుగంటలకు. పెళ్ళికుమారుని తండ్రి వచ్చి మేడమీది తూర్పువైపు గది వాళ్ళకు కేటాయించారని, పైకి వెళ్ళి పడుకోవచ్చని చెప్పి వెళ్ళిపోయాడు.

కమల, ఆమె తల్లి మేడమెట్లు ఎక్కారు. కమల తలుపు తీయబోతూ ప్రక్క గది లోపల సంభాషణ విని ఆగిపోయింది. అందులో తన పేరు వినబడడంతో.

పరిమళ వెక్కిళ్ళు వినిపిస్తున్నాయి.

"అప్పుడు ఆమె భర్త లేడా" అడుగుతోంది పరిమళ తల్లి.

"లేదమ్మా. కమల ఒక్కతే ఉంది."

"నీమాటలకు ఆమె ఏమంది"

"ఏమంటుంది. నాకింతకాలం తెలియదక్కా, నిజంగా ఇప్పుడాలోచిస్తే ఇంతకాలం చీకటికి సింబల్‌గా నల్లగాఉన్న భర్తతో ఎలా కాపురం చేసానో. పిల్లలుకూడా అదే రంగుతో ఎంత అసహ్యంగా ఉన్నారు. నువ్వు చెప్పింది నిజమే. ఎర్రగా, అందంగా ఉండే భర్త, తెల్లగా ముద్దొచ్చేట్టు ఉండే పిల్లలూ, పదిమంది కంటికి ఇంపుగా ఉండేది అలాంటి సంసారమే కదా అంది"

"వెంటనే వచ్చేసావా"

"వచ్చేసాను. వస్తూ వస్తూ కమల మనసులో ఓ విషపు బొట్టు రాల్చేసి వచ్చాను. అది నిజంగా బాగాపనిచేసినట్లు కమల ఒంటరిగా రావడంతోనే అర్థమయింది"

"అరెరె.... పాపం"

"పాపం ఏమిటమ్మా. లేకపోతే నన్నుచేసుకొంటాడనుకొన్న ప్రతాప్ నన్నుకాదని మనకంటే ఆస్తిలేని కమలను కాని కట్నం లేకుండా చేసుకొంటాడా. నేను అయన్ని పెళ్ళిచేసుకోవాలని ఎన్ని కలలుగన్నాను. ఆయన స్కూటరుమీద తిరగాలని ఎంత తపించి పోయాను" ఏడుస్తూ అంది పరిమళ.

"ఛ.... ఏడవకే"

"ఏడవక ఏం చేసేది. నాకూ కట్టారుగా ఓ మొగుడ్ని. ఎలిమెంటరి స్కూలుటీచర్ని. నయాపైసా ఖర్చుపెట్టడానికి ఏడుస్తాడు. ఒక మంచి నగలేదు. ఒక మంచి బట్టలేదు పిల్లలు చూడబోతే ఈవయసులోనే తల్లిదండ్రులు మాట వినేట్టులేరు. కమల భర్త ప్రతాప్‌కి రెండు వేలు జీతం. అయన నలుపైతేనేం ఎంత బాగుంటాడు. నొక్కుల జుట్టు. భారీ ఆకారం, పిల్లలుమరీనమ్మారంగు తక్కువైతేమాత్రమేం ఎంతో ముద్దొస్తారు. ఎంతో క్రమశిక్షణతో ఉంటారు. తెలివిగలవాళ్లుకూడా. అందుకే నాకు కాని దానిని ఇంకొకరు అనుభవిస్తూంటే చూళ్లేకపోయాను" వెక్కిళ్ళు ఎక్కువయ్యాయి.

"ఎవరికెంత ప్రాప్తమో అంతేనే పరిమళా. ఇక పడుకో. ఎవరైనా వింటే కమలకు చెప్పేస్తారు"

"కమలకు ఆమె భర్త త్వరలోనే విడాకులిస్తాడని నా ఉద్దేశ్యం" అంది పరిమళ. తరువాత నిశ్శబ్దం. లైటు ఆరిపోయింది.

అంతవరకూ వస్తున్న కోపాన్ని నిగ్రహించుకొంటున్న కమలకు విడాకులు అన్నపదం వినిపించేసరికి స్పృహతప్పుతున్నట్లు క్రిందపడిపోయింది, తల్లి ఆమెకు శుశ్రూషచేసి గదిలోకి తీసుకొచ్చింది. ఆరాత్రంతా నిద్రపోకుండా తల్లి ఒడిలో తలపెట్టుకొని

తనభర్త తనను ఎలా ప్రేమించేది. తన పిల్లలు తనపై చూపే అభిమానం. తను వాళ్ళకు చేసిన అన్యాయం చెప్పుకొని, చెప్పుకొని ఏడ్చింది.

వివాహం పూర్తికావడమే తడవు తిరుగు ప్రయాణమయ్యారు తల్లీకూతుళ్ళు.

పరిమళ ఎంతోఅప్యాయంనటిస్తూ "కమలా ప్లీజ్. ఈరోజు ఉండిపో" అంది చేయిపట్టుకొని.

కమల మెల్లగా తనచేతిని విడిపించుకొని "నేను మాఅమ్మతోటే ఊరికి వెళ్తున్నాను. ప్రతాప్ దగ్గరకు వెళ్ళే ఉద్దేశ్యంలేదు" అంది ఓదారుస్తున్నట్లు.

పరిమళ ఆనందంగా నవ్వి "అలాగయితే వెళ్ళిరా. ఉండమన్నా ఉంటావా'' అంది.

ఇంతలో పరిమళ కొడుకు పరుగెత్తుకుంటూ వచ్చాడు జారిపోతున్న లాగు పైకి లాక్కుంటూ, ఇంకోచేతిలో లడ్డుపట్టుకొని కొరుక్కుంటున్నాడు. ఒంటిమీద చొక్కాలేదు. ఉదయాన్నే మట్టిలో పొర్లాడి వస్తున్నట్లుగా ఉన్నాడు. ఇంతకుముందు మెచ్చుకొన్న కమల ఈసారి వాడివైపుకూడా చూడకపోవడంతో పరిమళ ముఖకవళికలు కొద్దిగా మారాయి.

తిరుగు ప్రయాణంలో కమల హృదయం పశ్చాత్తాపంతో దహించుకుపోసాగింది. తన కన్నబిడ్డల్ని తనే అసహ్యించుకొనే తల్లి ఈ ప్రపంచంలో ఎక్కడైనా ఉంటుందా. 'అమ్మా' అంటూ తనను పెనవేసుకొనే తనరక్తం పంచుకుపుట్టినబిడ్డలు తల్లి ప్రేమ కరువై ఎంత దిగులుపడ్డారో. బిడ్డలమీద ప్రేమానురాగాలు పొంగి పొరల సాగాయి

తనను ప్రేమించి పూజించే భర్తయెడల తనెంత నిరాదరణ చేసింది. దీనికంతటికి కారణం పరిమళ. ఆరోజు ఉదయం భర్తను సాగపంపి ఇంట్లోకిపోతుంటే "కమలా"అని ఎవరో పిలిస్తే వెనక్కి తిరిగింది. అక్కడ తన పిన్ని కూతురు పరిమళ వుంది.

"ఎన్నాళ్ళకు చూశాను. రా లోపలికి" అంటూ ఆహ్వానించింది తను. తన భర్తతరపు బంధువులు ఈ ఊళ్ళో వున్నారని, బంధువుల ఇంటి దగ్గర నుంచి అలా బజారుకు బయలుదేరితే ఇక్కడ తనను చూసినట్లు చెప్పింది.

ఒకే ఊరివారుకావడం చిన్ననాటి కబుర్లు ఎన్నో చెప్పుకొన్నారు. ఇంతలో తన పిల్లలు వచ్చారు. వాళ్ళని తను ఎత్తుకొని ముద్దుచేసింది. "ఏమిటే కమలా నీకు పిల్లలింత నల్లగా పుట్టారు....ఛీ....ఛీ నువ్వెంత తెల్లగా, అందంగా నాజూగ్గా ఉన్నావు. నీపిల్లలేమిటి ఇలా బొగ్గుల్లాగున్నారు" అంది.

తన మనసు చివుక్కుమంది.

"బాధపడకులే ఏంచేస్తాం. నీభర్తరంగూ అదేకదా" అంటూ ఓదార్చింది. తనైతే ప్రాణంపోయినా అలాంటి భర్తతో పిల్లలతో కాపురంచేయనని చెప్పింది. ఇంకా ఏవేవో ఉదాహరణలతో తనకు బోధచేసింది.

అంతే... తన బేలమనసు విరక్తితో నిండిపోయింది. తన కాపురమూ ఒక కాపురమేనా అనిపించింది. ఏమీలేని బీదకుటుంబంలో పుట్టిన తనను కానీ కట్నంలేకుండా పెళ్ళిచేసుకొన్నాడని కూడా తను ఆరోజు ఆలోచించలేదు. ఆయన మంచి మనసును గ్రహించలేక పోయింది.

ఇవన్నీ గుర్తుకొచ్చి కళ్ళనీళ్ళు నింపుకోసాగింది. కూతురు పరిస్థితి గమనించిన తల్లి ఆమెను ఓదార్చసాగింది.

ఇంటికి వచ్చేసరికి బయట వరండాలో ఇద్దరుపిల్లల్ని కూర్చో బెట్టి ఏదో చెబుతున్నాడు ప్రతాప్. తల్లిని చూసినా పిల్లలు అక్కడి నుంచి కదలలేదు

"ఒరేయ్ నాన్నలూ ... బాబూ" అంటూ గేటు దగ్గర నుంచే చేతులు చాపింది.

ఆ పిలువు కోసమే తపించిపోయినవాళ్ళు వెర్రి ఆనందంతో పరుగెత్తి తల్లిని పెనవేసుకున్నారు. ఇంతలో ఇంట్లోంచి వచ్చిన ప్రతాప్ చెల్లెలు "ఇప్పుడేనా రావడం" అంటూ నవ్వుతూ పలుకరించింది.

ప్రతాప్ లోపల గదిలోకివెళ్ళి పడుకొన్నాడు. కొద్దిసేపటికి తలుపులు తెరచుకొన్నాయి. గుమ్మంలో....

నీళ్ళు నిండిన కళ్లతో కమల.

కొద్దిసేపు మౌనంగా ఉన్నాడు ప్రతాప్.

"పెళ్ళి బాగా జరిగిందా" రెండు నెలల తరువాత మొదటిసారిగా మాట్లాడాడు.

అవున్నట్లు తల ఊపింది కమల.

"సరే వెళ్ళి రెస్టు తీసుకో. చాలాదూరప్రయాణం కదా"

అయినా ఆమె కదల్లేదు.

"అవి తప్ప ఇంకేమీ లేవాండీ, మాట్లాడడానికి" దుఃఖం ఎక్కువకాగా బొంగురుగా అడిగింది.

"ఇక కొత్తవిషయాలేం లేవు. పిల్లలు బాగానే ఉన్నారుగా" అంటూ కళ్ళు మూసుకొన్నాడు.

కమల ఇక ఆగలేకపోయింది. ఒక్కొక్క అడుగే ముందుకు వేస్తూవచ్చి ప్రతాప్‌ను ఆర్తిగా కౌగిలించుకొంది. అతని శరీరాన్ని నిమురుతూ పెద్దగా ఏడ్చింది.

"నేను....నేను మోసపోయానండి. ఎవరో ఏదో మాట్లాడితే దాన్నే నమ్మిన మూర్ఖురాల్ని నన్ను క్షమిస్తారు కదూ"

"ఇందులో క్షమించడానికి నువ్వేం తప్పు చేసావు. సంసారంలో ఎవరి హక్కులు వాళ్ళకున్నాయి. ఎవరి స్వాతంత్ర్యం వాళ్ళకుంది. నీ హక్కును, స్వాతంత్రాన్ని నేనెప్పుడూ భంగం చేయదలచుకోలేదు"

"అంతేనా. నన్ను మీరు పూర్వంలా ఆదరించలేరా. ప్రేమించలేరా"

"పిచ్చి కమలా. నీది సున్నితమైన మనసు. కనుకనే పరిమళ తేలిగ్గా నీ మనసును మళ్ళించగలిగింది. కాని ఏరోజుకైనా నీవు పశ్చాత్తాపపడతావని నాకు తెలుసు. నీవు వెళ్లిన తరువాత పరిమళ భర్తద్వారా, నీవు అలా ఎందుకు ప్రవర్తిస్తున్నావో తెలుసుకొన్నాను. కమలా ఒకటి మాత్రం నిజం. నేనూ నా పిల్లలు నల్లని వాళ్ళమే. కాదనను. మాలో ప్రవహించేది, ఎర్రగా అందంగా ఉన్నాననుకొంటున్న పరిమళ శరీరంలో ప్రవహించేది ఎర్రని రక్తమే. అందరి శరీరాల్లో ప్రవహించేది ఎరుపు రక్తమే అయినా అందులో కనుపించని ఎన్నో రంగులున్నాయి. పరిమళ శరీరంలో విషపూరితమైన నల్లని రక్తం ప్రవహిస్తోంది. అది తెలుసుకొన్నావు చాలు"

"ఐయామ్....సో సారీ" భర్తను కన్నీళ్ళతో అభిషేకించింది కమల.

★